క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన సర్రాజు కుమారులు


సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సర్రాజు కుమారులు వాసు, వర్మ

ఆకివీడు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పాతపాటి సర్రాజు కుమారులు పాతపాటి శ్రీనివాసరాజు(వాసు), వర్మ మర్యాద పూర్వకంగా కలిశారు. నాన్న లేని లోటును పార్టీకి తీర్చాలని జగన్ వారికి సూచించినట్లు వాసు విలేకర్లకు చెప్పారు. పార్టీకి శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని వాసు, వర్మ వివరించినట్లు తెలిపారు.

నారాయణ స్వామి మృతి తీరని లోటు


కేజీఆర్ఎల్ కళాశాలలో యర్రా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరంలో విద్యాభివృద్ధికి ఎనలేని కృషిచేసిన మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి మరణం విద్యాసంస్థలకు తీరని లోటని భీమవరం కేజీఆర్ఎల్ విద్యాసంస్థల అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు) అన్నారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన సంతాపసభలో నారాయణ స్వామి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వబిలిశెట్టి కనకరాజు, జాయింట్ సెక్రటరీ ఆరేటి ప్రకాష్, కోశాధికారి గన్నాబత్తుల వెంకట శ్రీనివాస్, సెక్రటరీ అండ్ కర్సపాండెంట్ మెంటే రామ్‌మనోహర్, ప్రిన్సిపాల్ హరనాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో సంబరాలు


ఎస్పీ రవిప్రకాష్‌కు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

పాలకోడేరు: పశ్చిమ గోదావరి జిల్లా ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ యు.రవిప్రకాష్‌కు సన్మానం చేసి , కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా భీమవరం సీఐ నాగ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రవిప్రకాష్ నాయకత్వంలో క్రమశిక్షణ కలిగిన సైనికుల్లా పనిచేస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రజలు, ప్రజా ప్రతినిధులు తమకు ఎంతో సహకరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు, కానిస్టేబుల్ శంకర్ లు పాల్గొన్నారు. జిల్లాలో ఉన్న ఇతర ఉన్నతాధికారులు మర్యాద పూర్వకంగా వచ్చి ఎస్పీని కలిశారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం


వీరవాసరంలో కేక్ కట్ చేస్తున్న వైసీపీ నాయకులు

వీరవాసరం: ముఖ్యమంత్రి జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మండల వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం తెలిపారు. జిల్లా కేంద్రం భీమవరంగా ప్రకటించి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా వీరవాసరం తూర్పు చెరువు సెంటర్లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చొరవతో భీమవరం జిల్లా కేంద్రం ఏర్పడడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగ మల్లేశ్వరరావు (బాబు), పట్టణాధ్యక్షుడు నూకల కనకారావు, వైసిపి మాజీ మండల కన్వీనర్ నేతలు జ్ఞాన సుందర్రాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, వీరవాసరం సర్పంచ్ చికిలే మంగతాయారు, గెద్దం భాస్కరరావు, పోలిశెట్టి సత్యనారాయణ, మాగంటి నాగేశ్వరరావు, నూకల అప్పాజీ, దాసరి మాణిక్యాలరావు, సైదు శ్రీనివాసరావు, మద్దాల సత్యనారాయణ మూర్తి, నాగరాజు వెంకట గోపాలకృష్ణంరాజు, పంజా ప్రసాద్ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అమృత్ సరోవర్ పథకంలో ముత్యాలపల్లి, వారతిప్ప, మొగల్తూరు, రామన్నపాలెం, పేరుపాలెం నార్త్ గ్రామాల్లో చెరువులను అభివృద్ధి చేస్తుండగా మిగిలిన గ్రామాల్లో పంట కాలువలు, బోదెల్లో గుర్రపుడెక్కను తొలగిస్తున్నారు. పెరిగిన గుర్రపుడెక్కను మంగళవారం తొలగించే పనులు చేపట్టామని ఏపీవో వై శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా జిల్లా ఆవిర్భావ వార్షికోత్సవం

భీమవరం(ప్రకాశం చౌక్): ఆప్యాయత.. అనురాగం .. అభిమానం.. ఇదే మన భీమవరం అని, భీమవరం జిల్లా కేంద్రం కావడం అందరి అదృష్టమని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం జిల్లా కేంద్రంగా ఏర్పడి ఏడాదైన సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధ్వర్యంలో భీమవరంలో సంబరాలు నిర్వహించారు. ముందుగా సోమేశ్వర స్వామి దేవస్థానం, మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏఎంసి కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ భీమవరాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని, అందరి సహకారం ఎంతో ముఖ్యమని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు భీమవరం కేంద్రంగా నిర్ణయం తీసుకుని అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటానని అన్నారు. కలెక్టరేట్ మరింత అందుబాటులో ఉండేందుకు కలెక్టరేట్‌ను మార్కెట్ యార్డుకు శాశ్వతంగా తరలించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసిందని, త్వరలోనే మార్కెట్ యార్డ్‌కు కలెక్టరేట్ మారుతుందన్నారు. ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గూడూరు ఉమాబాల, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, ఏఎంసి మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, కోడె విజయలక్ష్మి, చెల్లబోయిన సూర్య ప్రకాష్, మానేపల్లి నాగేంద్రబాబు, పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, కోడే యుగంధర్, పేరిచర్ల సత్యనారాయణరాజు, నల్లం రాంబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు, కోమటి రాంబాబు, పాలవెల్లి మంగ, కానుబోయిన వెంకటరమణ, వేండ్ర దుర్గ, మద్దుల కరుణ్ కుమార్, గంట సుందర్ కుమార్, పాలపర్తి జోనా తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తదితరులు

మేలు చేసే ప్రభుత్వానికి మద్దతివ్వండి

- జగన్ వెంటే మహిళలంతా...
- వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేసిన పీవీఎల్

కాళ్ల: మహిళలను ఆర్థిక శక్తి వంతులుగా తీర్చిదిద్ది సంపూర్ణ సాధికారిత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని సీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. కాళ్ల మండలం జక్కరం గ్రామంలో వైస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా మండలంలోని 1269 గ్రూపులకు సుమారు రూ. 16.68కోట్లు విలువైన చెక్కులను డ్వాక్రా మహిళలకు అందించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆడపడుచులందరికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక భరోసా కలిస్తున్నారని ఆయన వెంట మహిళలంతా ఉంటారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ధీమా వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల ముందు ఆనాడు చంద్రబాబునాయుడు మహిళలందరికీ రుణమాఫీ చేస్తానని మోసగించాడని, పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలంతా విన్నవించుకున్న సందర్భంలో తాను అధికారంలోకి వస్తే నాలుగదఫాల్లో మీ రుణాలన్నీ మాఫీ చేస్తానని మాటిచ్చారని తెలిపారు. వేల కోట్లు రూపాయలను ఇచ్చిన మాటకు కట్టుబడి మూడో విడత కూడా ఆసరా చెక్కులు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే చెల్లుతుందన్నారు. రాష్ట్రంలో నూటికి 90% మందికి ఏదొకరూపంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు ఇచ్చి మీ కుటుంబాలు బాగు చేయటమే కాకుండా మీ పిల్లల భవిష్యత్తు కూడా బాగుండాలని వారి చదువుల కోసం తల్లులు ఖాతాల్లో అమ్మఒడి రూపంలో రూ.15వేలు జమ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పిల్లలు భవిష్యత్తు కోసం ఆలోచిస్తున్న ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద ఎత్తున మహిళలకు సంక్షేమ పథకాలు అందించిన దాఖలాలు లేవన్నారు. పొత్తుల కోసం చంద్రబాబు నాయుడు వెంపర్లాడుతున్నారని విమర్శించారు. ప్రతి మహిళా కూడా ఆత్మ పరిశీలన చేసుకుని రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉంటే తమ జీవితాలు బాగుంటాయో ఆలోచించుకోవాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గాదిరాజు సుబ్బరాజు, సర్పంచ్ చాంబర్ జిల్లా అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, జడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, జక్కరం సర్పంచ్ కూచంపూడి పద్మావతి, వైస్ ఎంపీపీలు సరాబు పద్మారాణి, మన్నే నాగలక్ష్మి శ్రీనివాస్, కలవపూడి, కోపల్లె, కాళ్ల సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స దుర్గాప్రసాదరాజు, వేగేశ్న జయరామకృష్ణంరాజు, సుంకర భోగేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు గణేశ్న రాంబాబు, పెన్మెత్స ఆంజనేయరాజు, సాగిరాజు హరివర్మ, మన్నే నాగరాజు, కూచంపూడి లక్ష్మీపతి రాజు, వేగేశ్న విజయరామరాజు, చిన్నాపరపు రాంబాబు, వీరమల్లు మోహనరావు, ఎంఎస్ఎన్ రాజు, డ్వాక్రా ఏపీఎం శ్రీనివాసరావు, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్లు, డ్వాక్రా సీసీ లు, డ్వాక్రా మహిళలు, అధికారులు పాల్గొన్నారు.


జక్కరం గ్రామంలో వైఎస్ ఆసరా చెక్కుల పంపిణీ చేస్తున్న పీవీఎల్


జక్కరం గ్రామంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

ఆసరాతో ఆడపడుచులకు ఆర్థిక భరోసా

- మూడు విడతల డ్వాక్రా రుణ మాఫీ సొమ్ము రూ. 187.83 కోట్లు
- ఉండి నియోజకవర్గంలో మొత్తం లబ్ధిదారులు: 1,57,089.

ఆకివీడు: ఆర్థికంగా మహిళలు నిలబడినప్పుడే మహిళా సాధికారిత సాధ్యమవుతోందని భావించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కోసం అనేక పథకాలు అమలు జరుపుతున్నారు. నవరత్నాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. అన్ని వర్గాల మహిళలకూ చేయూత పథకం ద్వారా ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా, డ్వాక్రా రుణ మాఫీని కొనసాగిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంతో మహిళల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఏడాది నుంచి ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణమాఫీ సొమ్మును మూడు పర్యాయాలు మహిళలకు అందజేశారు. ఉండి నియోజకవర్గంలో 1,57,089 మంది లబ్ధిదారులకు మూడు విడతలకు గానూ రూ. 187.83 కోట్లు రుణమాఫీ సొమ్మును అందజేశారు. మహిళల్ని ఆర్థికంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే సమాజంలో వారికి సముచిత స్థానం లభిస్తుందని, మహిళ శక్తిగా ఎదుగుతుందని సీఎం భావించారు.


డ్వాక్రా మహిళలు

రుణమాఫీ వరం

మహిళలకు రుణ మాఫీ వరం లాంటిదని పలువురు మహిళలు భావిస్తున్నారు. డ్వాక్రా రుణాలు పొందిన మహిళలకు వడ్డీ మాఫీతో పాటు రుణ మాఫీ మంజూరు చేయడంతో వారి సంతోషానికి అవధ్దులేవు. అంచెలంచెలుగా రుణమాఫీ చేయడంతో ఆ సొమ్ము ఇతరత్రా ఉపయోగాలకు, పనిముట్లు కొనుగోలుకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు. నియోజకవర్గంలోని ఆకివీడు మండలంలో 14,058 మంది లబ్ధిదారులకు రూ. 16.39 కోట్లు, ఉండిలో 12,586 మందికి రూ. 15,30 కోట్లు, కాళ్లలో 12,768 మందికి రూ. 16.68 కోట్లు, పాలకోడేరు మండలంలో 12,960 మందికి రూ. 14.24 కోట్లు మూడవ విడతలో లబ్ధిదారుల ఖాతాల్లో రుణ మాఫీ సొమ్ము జమ అయింది.

నియోజకవర్గంలో మూడు విడతల్లో రుణమాఫీ

మండలం	లబ్ధిదారులు	రుణమాఫీ సొమ్ము
ఆకివీడు	42,174	రూ. 49.17 కోట్లు
ఉండి	37,758	రూ. 45.90 కోట్లు
కాళ్ల	12,768	రూ. 50.04 కోట్లు
పాలకోడేరు	38,880	రూ. 42.72 కోట్లు
మొత్తం	1,57,089	రూ. 187.83 కోట్లు

టీడీపీ మోసం చేసింది

డ్వాక్రా రుణ మాఫీ చేస్తామని చెప్పిన టీడీపీ ప్రభుత్వ హయాంలో రుణమాఫీ చేయకుండా మహిళల్ని మోసగించిందని పలువురు ఆరోపిస్తున్నారు. రుణమాఫీ చేయకుండా ఐదేళ్ల గడిపిన ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఎన్నికల్లో పసుపు కుంకుమ పేరుతో బురిడీ కొట్టించారని ఎద్దేవా చేస్తున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి జగనన్న మూడేళ్లుగా రుణమాఫీ సొమ్ము అవినీతికి తావులేకుండా మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నారని పలువురు మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్): హౌసింగ్ బోర్డు కాలనీలోని పద్మావతీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కేంద్రంగా ఏర్పడి సంవత్సరం అయిన సందర్భంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హర్షాతిరేకాలు తెలిపారు. భవిష్యత్తులో మన జిల్లా ఇంకా అభివృద్ధి పథంలో ఉండాలని త్వరలోనే రాష్ట్ర మంతటా 26 జిల్లాల్లోనూ అభివృద్ధి సంపూర్ణంగా జరగాలని, రైతులు ఆనందంగా వుండాలని కోరుతూ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యానర్లు, ప్లకార్డులతో కాలనీ అంతా ఊరేగింపు నిర్వహించి కాలనీ పెద్దలు పాలక వర్గ సభ్యులు, శాసన సభ్యులు గ్రంది శ్రీనివాస్, శాసన మండలి సభ్యులు కొయ్యే మోషేనురాజు, కలెక్టర్ ప్రశాంతికు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు హౌసింగ్ బోర్డు డేవలప్ మెంట్ సభ్యులు కంతేటి వెంకట్రాజు, చుక్కల బాల వెంకటరత్నం, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి, జ్ఞానపాటి మదుసూదనరావు, బార్ అసోసియేషన్ సభ్యులు ఉండపల్లి రమేష్ నాయుడు భట్టిప్రోలు శ్రీనివాస్, శ్రీనివాసచార్యులు, ఫణి, చల్లా రాములు తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న దృశ్యం

బొండాడలో ముగిసిన కల్యాణ మహోత్సవాలు

కాళ్ల: మండలంలోని బొండాడ గ్రామంలో కందుల లక్ష్మణస్వామి, లక్ష్మీతులసమ్మ దంపతులచే ప్రతిష్ఠించిన భద్రాద్రి శ్రీరామచంద్రస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ మహోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి ప్రదర్శించిన బాలనాగమ్మ, శ్రీకృష్ణార్జునయుద్ధం నాటకాల్లో పాత్రధారులు ప్రదర్శించిన నటన ఆకట్టుకుంది. అదేవిధంగా కల్యాణ మహోత్సవాల ముగింపుని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో మంగళవారం అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత పలు రకాల పిండి వంటలతో స్వామి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించిన అనంతరం భక్తులకు ప్రసాదం వడ్డించారు. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న స్వామివారి కల్యాణం మహోత్సవాలు ముగింపు సందర్భంగా అన్నసమారాధన నిర్వహించినట్లు నిర్వాహకుడు, మాజీ ఎంపీపీ కందుల వెంకటమల్లిఖార్జునరావు తెలిపారు. దాతలు, భక్తుల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు అన్న సమారాధనలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను గ్రామ పెద్దలు, రామాలయం కమిటీ సభ్యులు, భక్తులు పర్యవేక్షించారు.


బొండాడలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

యువత మానవ సంబంధాలను అధ్యయనం చేయాలి

సాక్షి, భీమవరం: మానవ సంబంధాలను అధ్యయనం చేసినప్పుడే యువతకు నిజమైన విజ్ఞానం లభిస్తుందని ఆదికవినన్నయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎస్ కిరణ్‌చంద్ర అన్నారు. భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ రెస్టోరేషన్ సభలో ఆయన మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సమాజంలోని అట్టడుగువర్గాల కష్టసుఖాలను అధ్యయనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ కాకుమాని శ్రీనివాసరావు, సుందర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జి సుందరరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ లక్ష్మీకాంతం, ఆర్ అరవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆకివీడు: అనారోగ్యంతో మంచం పట్టిన కళాకారుడు కుంచాడ మోహనరావుకు రైస్‌మిల్లు కార్మికుడు పెంకి అప్పారావు తన రిటైర్‌మెంట్ అనంతరం వచ్చిన ఫించన్ సొమ్ము రూ. 3,576లు మంగళవారం అందజేశారు. సీపీఎం సీనియర్ నాయకులు బీ.సత్యనారాయణ చేతుల మీదుగా సొమ్మును మోహనరావుకు అందజేశారు. రైస్‌మిల్లు కార్మికుడుగా, రిక్షా కార్మికుడిగా జీవనయాత్ర కొనసాగించిన మోహనరావు విప్లవ గేయాలకు డప్పు వాయిద్యాన్ని అందించేవారు. నటుడుగా సీతారామరాజు నాటికలో ఆదివాసీ పాత్రను పోషించి పలువురు మన్ననలు పొందారు. గత ఏడాది కాలంగా పంచం పట్టిన ఆయన ఆర్థిక స్థితి బాగుండకపోవడంతో తనకు తోచిన సహాయం అందజేసినట్లు అప్పారావు తెలిపారు.

సైకిల్ అపహరణ

సాక్షి, భీమవరం: పట్టణంలోని వీరమ్మపార్క్ సమీపంలో సైకిల్ దొంగిలించగా కేసు నమోదు చేసినట్లు టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ చక్రవర్తి చెప్పారు. ఈనెల 3వ తేదిన పార్క్ వద్ద పార్క్ చేయగా గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు చేసిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చక్రవర్తి చెప్పారు.

కోడిపందేలపై దాడులు

పాలకోడేరు: మోగల్లు పంచాయతీ పరిధిలోని గుత్తుల వారి పాలెంలో నిర్వహిస్తున్న కోడిపందాలపై ఎస్సై నాళం శ్రీనివాసరావు మంగళవారం సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ. 2100 నగదు ఒక కోడి, కోడి కత్తి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వృద్ధులకు భోజనం ప్యాకెట్ల పంపిణీ


భీమవరంలో వృద్ధులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

సాక్షి, భీమవరం: భీమవరం కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు స్థానికంగా నివసించే వృద్ధులకు, నిరాశ్రయులకు మంగళవారం భోజనం ప్యాకెట్స్ పంపిణీ చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె జాకబ్ఇస్సాక్ ప్రోత్సహంతో పట్టణంలోని రైల్వేస్టేషన్, వివిధ కూడల్లోని వృద్ధులకు ఆహారం పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఫార్మసీ డైరెక్టర్ కె.నాగేశ్వరావు, ప్రిన్సిపాల్ డి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆకివీడులో ఆసరా సదస్సు

ఆకివీడు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు జరుపుతున్న నవరత్నాల్లో ఒకటైన డ్వాక్రా రుణమాఫీ పథకం మూడవ విడత కార్యక్రమం ఆకివీడు పట్టణంలోని సీఎం హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 5వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఆసరా కార్యక్రమం జరుగుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజు మంగళవారం చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తున్న ముఖ్యమంత్రి మనకు దొరకడం అదృష్టమన్నారు. మండలంలో 14,058 మంది లబ్ధిదారులకు రూ. 16.39 కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యే విధంగా సీఎం బటన్ నొక్కారని చెప్పారు. సీఎంకు కృతజ్ఞత తెలిపే విధంగా మహిళలు ఆసరా సదస్సుకు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా గ్రూప్-4 పరీక్ష

సాక్షి, భీమవరం: జిల్లాలో మంగళవారం నిర్వహించిన గ్రూప్ 4 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు షిఫ్టులకుగాను 350 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 37 మంది గైర్హాజరయ్యారు. తాడేపల్లిగూడెంలోని వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో 240 మందికిగాను 28 మంది, శశి ఇనిస్టిట్యూట్‌లో 180 మందికి గాను 34 మంది హాజరయ్యారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

సాక్షి, భీమవరం: పేదలు ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న స్థానిక తిరుమల కళాశాల విద్యార్థిని ఎ.ప్రణీతకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.10 లక్షల చెక్కును సోమవారం చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సుమారు రూ.3 వేలకు పైగా రోగాలకు పేదలకు ఉచిత వైద్యం అందిస్తుందని ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధులు అందజేస్తున్నట్లు మోషేన్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, వైసీపీ పట్టణాధ్యక్షుడు తోట భోగయ్య తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మోషేన్‌రాజు, గ్రంధి శ్రీనివాస్

సుందరంగా మినీ పార్కు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మునిసిపల్ కార్యాలయ ఆవరణలో రూ.15 లక్షలతో నిర్మించిన మినీ పార్కు సుందరంగా ఉందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన పార్కును ప్రారంభించి మాట్లాడారు. మునిసిపాలిటీకి వచ్చే ప్రజలు సేద తీరటానికి ఎంతో అనువుగా ఉంటుందన్నారు. పార్కు నిర్వహణను సక్రమంగా చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఇంజనీరింట్ అధికారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎస్ శివరామకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, తోట భోగయ్య. ఎంఇ పి త్రినాధరావు, డిఇ నారాయణరావు, వేండ్ర ప్రసాద్, నల్లం రాంబాబు, ఆర్గురాజు, తదితరులు పాల్గొన్నారు.


మినీ పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

డ్రైనేజ్ సమస్య పరిష్కారానికి అధికారుల హామీ

ఉండి: మండలంలోని చినపుల్లేరు గ్రామ శివారు తల్లమ్మచెరువు ప్రాంతంలో తలెత్తిన డ్రైనేజ్ సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు ఎంపీడీవో ఏవీ అప్పారావు తెలిపారు. మంగళవారం తల్లమ్మచెరువు ప్రాంతంలో స్పందన ఫిర్యాదు పరిష్కరించేందుకు వెళ్లిన అధికారుల బృందానికి స్థానికుల నుంచి నిరసన ఎదురైంది. ఫిర్యాదు చేసిన వారికే కాకుండా ప్రాంతంలోని అందరికీ డ్రైనేజ్ సౌకర్యం కల్పించాలంటూ అధికారులకు స్థానికులు తెలియపరచడంతో అందరికీ డ్రైనేజ్ సదుపాయం కల్పించేందుకు వినతి పత్రం ఇవ్వాలని దానిని ఉన్నతాధికారులకు పంపించి అందరికీ డ్రైనేజ్ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ తదితరులు పాల్గొన్నారు.